క్లుప్తంగా

ఉత్సాహంగా వసంతోత్సవం



రంగుల బండితో యువకులు

పాములపాడు: శ్రీరామనవమి పండుగ సందర్భంగా సోమవారం పాములపాడులో యువకుల కేరింతల నడుమ వసంతోత్సవాన్ని నిర్వహించారు. రామాలయం నుంచి రంగుల బండిని మేళతాళాలతో గ్రామంలోని పురవీధుల వెంట తిరిగారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

ఎక్సైజ్ ఎస్‌ఐగా శ్రీనివాసులు



ఎక్సైజ్ సీఐకి జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న ఎస్‌ఐ

నందికొట్కూరు: ఎక్సైజ్‌శాఖ ఎస్‌ఐగా బాష్యం శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పత్తికొండ ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై నందికొట్కూరు ఎక్సైజ్ శాఖకు ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్‌కు బదిలీ ఉత్తర్వులు అందజేశారు.

మహానందీశుడికి పల్లకోత్సవం



మహానందిలో పల్లకీసేవ

మహానంది: శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ దేవిక, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేపట్టారు.

అన్నప్రసాద వితరణకు విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం కర్ణాటక రాష్ట్రం, చికోడికి చెందిన సి.చిదానంద్ రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు ఎం.మల్లికార్జునకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదం, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

తహసీల్దార్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు లాజరస్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 14వ తేదీ అధికారుల సమక్షంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించాలన్నారు. శ్రీనివాసులు, డక్క కుమార్, మద్దిస్వామి, బొల్లెద్దుల ప్రసాద్ ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే షాపు సీజ్ చేస్తాం



బండలను తొలగిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్

జూపాడుబంగ్లా: మద్యం దుకాణాల వద్ద అనుమతి లేకుండా సిట్టింగ్స్ ఏర్పాటు చేసి మద్యం సేవించేలా చేస్తే మద్యం దుకాణాలను సీజ్ చేస్తామని నందికొట్కూరు ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయ నాయక్ హెచ్చరించారు. సోమవారం జూపాడుబంగ్లాలో కేజీ రోడ్డు పక్కన ఉన్న రేణుకా ఎల్లమ్మ మద్యం దుకాణాన్ని పరిశీలించారు. అనుమతి లేకుండా బండలతో సిట్టింగ్స్ ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించకుంటే దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. దుకాణం వద్ద ఏర్పాటు చేసిన సిట్టింగ్ బండలను తొలగించే వరకు మద్యం దుకాణం మూసి వేయించారు.

రమణీయం.. రథోత్సవం



కొత్తపల్లి: ఎదురుపాడులో అశేష భక్తుల నడుమ రథోత్సవం

పగిద్యాల: శ్రీరామనవమిని పురస్కరించుకుని సోమవారం స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవ వేడుకలు భక్త జనసందోహం మధ్య రమణీయంగా సాగాయి. సాయంత్రం 6.30 గంటల సమయంలో భక్తుల జయ జయ ధ్వానాల మధ్య సాగిన రథయాత్రకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. జై శ్రీరామ్ నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ఆధ్వర్యంలో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం బందోబస్తు ఏర్పాటు చేశారు. చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి కుంట వీధి వరకు రథోత్సవం సాగింది. డోలు వాయిద్యాలు, తప్పెట్లు, కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

-నందికొట్కూరు: పట్టణంలో రాములోరి రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి పాతబస్టాండ్, పటేల్ సెంటర్, ఆత్మకూరు రోడ్డు కోర్టు వరకు రథోత్సవం సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

-కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో స్వామివారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. అంతకు ముందు సీతారాముల ఉత్సవవిగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీలో కొలువుంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం రథంపై ఆశీనులను చేసి వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మేళతాళాలు, భాజా బజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో రథోత్సవం సాగింది. రథం ముందు దుర్గాదేవి అమ్మవారి వేషాధారణలో కళాకారుడు సంప్రదాయ నృత్యం చేస్తూ భక్తులు, గ్రామస్తులకు కనువిందు చేశారు. తిలకించేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



పగిద్యాల: లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు







పగిద్యాల: భక్త జనసందోహం మధ్య సాగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం, నందికొట్కూరులో.. , కొత్తపల్లి: అమ్మవారి వేషధారణలో మహిళ

నిరుపయోగంగా కంప్యూటర్లు



జూపాడుబంగ్లా 80బన్నూరు సహకార సొసైటీలో నిరుపయోగంగా కంప్యూటర్లు

జూపాడుబంగ్లా: గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుల సంక్షేమార్థం రైతు సేవా కేంద్రాలకు మంజూరు చేసిన కంప్యూటర్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. రైతుభరోసా కేంద్రాల్లో సహకార సొసైటీల తరుపున ఓ కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించారు. రైతుల వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు వారికి అవసరమైన రుణాలను సహకార సొసైటీల ద్వారా మంజూరు చేయడంతో పాటు వారు పండించిన ధాన్యాన్ని సొసైటీల ద్వారా కొనుగోలు చేసేందుకు వీలుగా రైతుభరోసా కేంద్రాలతో అనుసంధానిస్తూ సమాచారాన్ని నమోదు చేసుకొనేందుకు ఒక్కో రైతుభరోసా కేంద్రానికి రూ.60వేల విలువైన కంప్యూటర్‌ను మంజూరు చేశారు. జూపాడుబంగ్లా మండలంలో 11 రైతుసేవా కేంద్రాలకు 11 కంప్యూటర్లు మంజూరు కాగా నందికొట్కూరు నియోజవర్గం వ్యాప్తంగా నందికొట్కూరు, పగిద్యాల, మిడ్తూరు, కొత్తపల్లి, పాములపాడు, జూపాడు బంగ్లా మండలాల్లో 77 రైతుసేవా కేంద్రాలున్నాయి. వాటన్నింటికి రూ.46.20 లక్షల వెచ్చించి కంప్యూటర్లు మంజూరు చేశారు. వాటిని ఇప్పటి దాకా రైతుసేవా కేంద్రాలకు అనుసంధానించిన దాఖలాల్లేవు. దీంతో సొసైటీలకు మంజూరు చేసిన 77 విలువైన కంప్యూటర్లు నిరుపయోగంగా మూలనపడ్డాయి. జిల్లా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుని కంప్యూటర్లను వినియోగంలోకి తెచ్చి రైతులకు ఉపయోగపడేలా చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల మధ్య వాగ్వాదం

బండి ఆత్మకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇద్దరు మండల స్థాయి అధికారుల మధ్య వాగ్వాదం చేసుకుంది. వివరాలు.. గత నెలలో పరమటూరు గ్రామానికి చెందిన రైతు బండపల్లి బోయ నాగన్నకు సంబంధించిన 1.50 ఎకరాల్లో కంది పంట దగ్ధమైన ఘటనపై కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న మండల వ్యవసాయ అధికారి సంతకం కోసం అక్కడికి వెళ్లిన ఎస్‌ఐ జగన్‌మోహన్ మధ్య మాటా మాటా పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. అక్కడే ఉన్న తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి వారికి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమనిగింది.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

ఆత్మకూరు: ఈ-శ్రమ్ పోర్టల్‌లో ప్లాట్ ఫాం కార్మికులు, గిగ్ కార్మికులు పేర్లను నమోదు చేయించుకునేందుకు ఈనెల 7 నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక నమోదు శిబిరాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు కార్మిక సహాయ అధికారిణి పి.సారామార్గరేట్ తెలిపారు. సోమవారం ఆమె స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ కార్మికులు పేర్లను నమోదు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పాములపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని చెప్పారు. అలాగే ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బండి ఆత్మకూరు: మండలంలోని కాకనూరు గ్రామంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జగన్‌మోహన్ సోమవారం తెలిపారు. వివరాలు..పోలయ్య అనే వ్యక్తి తన ఇంట్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిలువ ఉంచాడనే సమాచారం మేరకు దాడి చేసి 7 క్వింటాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

తూడిచెర్లలో ఎద్దుల పోటీలు ప్రారంభం

జూపాడుబంగ్లా: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా తూడిచెర్లలో సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ప్రజలు సీతారాముల కృపాకటాక్షాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమద్దిలేటి, రాముడు, పిక్కిలి శ్రీనివాసులు, రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు



మాట్లాడుతున్న ఆత్మకూరు డీడీ వి.సాయిబాబా

ఆత్మకూరురూరల్: వేసవిలో దట్టమైన అడవులకు ముప్పుగా మారిన నిప్పు నివారణ చర్యలపై శ్రీశైలం - నాగార్జునసాగర్ పెద్దపులుల అభయారణ్యంలో అటవీ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తొలి రోజు సోమవారం ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని వైఎస్సార్ స్మృతివనంలో వర్క్‌షాప్ నిర్వహించారు. జాతీయ విపత్తు నివారణదళం 10వ బెటాలియన్‌కు చెందిన అధికారులు, కర్నూలు రాష్ట్ర విపత్తు నివారణ దళం స్థానిక అటవీ సిబ్బందికి అడవుల్లో వేగంగా అగ్నికీలలు విస్తరించకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎఫ్‌డీ పీటీ టీబీఏ కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం మధ్యాహ్నం వరకు సాగింది. అనంతరం బైర్లూటి చెంచు గూడెం గిరిజనులతో సమావేశమై అడవిలో నిప్పు, మానవాళికి ఎలా ముప్పుగా మారుతుందో వివరించి నిప్పు నివారించేందుకు వారి సహకారం కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ వి.సాయిబాబా, మార్కాపురం డీడీ సందీప్ కృపాకర్, గిద్దలూరు డీడీ నిశాకుమారి, నంద్యాల డీఎఫ్ఓ అనురాగ్ మీనా, శ్రీశైలం సబ్ డీఎఫ్ఓ రవూఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండర్, ఎఫ్ఆర్ఓలు,ఫైర్ వాచర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం



కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పాములపాడు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి, ఏఓ మహేష్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ఏపీసీఎన్ఎఫ్ స్టాల్‌ను ఏపీసీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జీ రాజునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, కూరగాయాలు, మామిడి కాయలు ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటల ద్వారానే నేల ఆరోగ్యం, వాతావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా మండల సమాఖ్య ఏపీఎం పుల్లయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

-పాములపాడు: ఎలాంటి రసాయన మందులు వాడకుండా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకోవడం ఆరోగ్యదాయకమని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రకృతి ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ ఉంచిన కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేశారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం మంచిదని తెలిపారు. ఎంఈఓ సుభాషినిదేవి, ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీఓ అలివేలి మంగమ్మ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



విత్తన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో విత్తన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందులు, మినుములు, శనగలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కందులు క్వింటా రూ. 7,550, మినుములు రూ. 7,400, శనగలు రూ. 5,650 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమాదేవి, ఏడీఏ విజయశేఖర్, మార్క్‌ఫెడ్ అసిస్టెంట్ మేనేజర్ అనూష పాల్గొన్నారు.

వేలంలో పంచాయతీకి ఆదాయం

బండి ఆత్మకూరు :స్థానిక పంచాయతీకి సంబంధించిన మార్కెట్లకు నిర్వహించిన వేలాల్లో పంచాయతీకి ఆదాయం లభించింది. సర్పంచ్ సంధ్య అద్వర్యంలో సోమవారం నిర్వహించిన వేలం పాటలో రూ. 154,000 లు ఆదాయం వచ్చినట్లు గ్రామ కార్యదర్శి అక్బర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సంతగేట్, బండ్ల మెట్ట, కమేళాకు వేలం చేపట్టగా.. సంతగేటుకు రూ.40 వేలు, కమేళాకు రూ.3వేలకు పోగా, బండమెట్ట రూ.1.51లక్షలకు పలికింది. ఈఓఆర్డీ రామకృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ కేసీలో పడి వ్యక్తి మృతి

పగిద్యాల: ప్రమాదవశాత్తూ కేసీలో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం నెహ్రూనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దావూద్ పఠాన్‌ఖాన్(50) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఉదయం పనికి వెళ్లి సాయంత్రం కాళ్లు చేతులు శుభ్రం చేసుకోవడానికి బ్రిడ్జి మెట్ల వద్ద కాలువలోకి దిగుతుండగా కాలు జారి నీళ్లలో పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. అక్కడే ఉన్న ఓ మహిళ బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు కేసీలోకి దూకి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని కుమారుడైన అంజద్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

తప్పుడు కేసులపై ఎస్పీకి ఫిర్యాదు

- టీడీపీ నేతల ఒత్తిడితో వైఎస్సార్‌సీపీ నేతపై కేసు నమోదు
- తనను ఎవరూ బెదిరించ లేదన్న ఫిర్యాదుదారు
- ఎస్పీ, ఏఎస్పీని కలిసిన వైఎస్సార్‌సీపీ నేత పుల్లయ్యయాదవ్

మహానంది: వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నేతలు తప్పుడు కేసులు పెట్టిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. తాజాగా మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ నేతలు ఒత్తిడి చేసి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించిన సంఘటన సోమవారం చర్చనీయాంశమైంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు పుల్లయ్యయాదవ్‌పై ఫిర్యాదు చేసిన కంబగాని మద్దిలేటితో గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఫోన్‌లో మాట్లాడితే తనకు ఏమీ తెలియలేదని, పుల్లయ్య తనను బెదిరించలేదని, తమ బావమరిది కేసులు పెట్టిస్తున్నాడని పేర్కొనడం గమనార్హం. ఏమని ఫిర్యాదు చేశారో సైతం తనకు తెలియదని, కేసు పెట్టే విషయం తనకు చెప్పకుండానే తనతో సంతకం చేయించారని చెప్పుకొచ్చాడు. పుల్లయ్యయాదవ్ మాట్లాడుతూ ఇటీవల ఎర్రమట్టి తవ్వకాల గురించి తహసీల్దార్, ఎస్‌ఐ, మైనర్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాననే నెపంతో తనపై గ్రామ టీడీపీ నాయకులు కక్ష పెంచుకున్నారన్నారు. దీంతో టీడీపీ నాయకుడైన రాముడు, గ్రామ నాయకులు క్రాంతికుమార్, శివ కలిసి ఫిర్యాదుదారుడిని తీసుకెళ్లి తప్పుడు కేసు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు కేసు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ మందా జావళిని కలిసి ఫిర్యాదు చేశానని చెప్పారు.

వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, ముస్లింలు



తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీపీలకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

జూపాడుబంగ్లా: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సోమవారం జూపాడుబంగ్లా బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీపీఐ నాయకులు, ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రంగనాయుడు, రఘురామ్మూర్తి, రమేష్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లగా కొనసాగుతున్న వక్ఫ్ చట్టాన్ని సవరణ చేయడం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఈ బిల్లుకు మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఉస్మాన్‌బాషా, ముస్లింమైనార్టీ నాయకుడు హమీద్, మగ్బుల్, ఖాజా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: రాష్ట్రంలోని ముస్లింలను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మోసం చేశారని ముస్లిం మైనార్టీ నాయకుడు దౌలత్‌బాషా అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు అండగా ఉంటామని చెప్పి వక్ఫ్ బోర్డు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడం సిగ్గు చేటన్నారు. మౌజాన్‌లు, ఇమామ్‌లకు జీతాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తయినా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త

- మధ్యాహ్నం పూట తప్పని సరి అయితేనే బయటకు వెళ్లాలి
- వేసవి జాగ్రత్తలపై కరపత్రాల ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఎండలు మండుతున్నాయని, ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెడ్ క్రాస్ సంస్థ ముద్రించిన కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ రాము నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్ కుమార్, జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, జిల్లా ఇన్‌చార్జ్ వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ డాక్టర్ లలిత, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, డీఎఫ్ఓ సమ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. వేసవిలో తెలుపు రంగు గల పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలని, సాధ్యమైనంత వరకు ఎండ వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటిపట్టునే ఉండాలన్నారు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా రుమాలు వంటివి వెంట తీసుకువెళ్లాలని, ఇంటికి వచ్చిన వెంటనే చల్లటి నిమ్మరసం లేదా కొబ్బరినీరు తాగాలన్నారు. వడదెబ్బ తగిలితే వెంటనే వైద్యులను సంప్రదించి ప్రాథమిక చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ సీజన్‌లో మాంసాహారాన్ని, మద్యపానాన్ని మానేయాలన్నారు.

సింహవాహనంపై శ్రీరంగనాథుడి అభయం



దేదీప్యమానంగా దర్శనమిస్తున్న శ్రీరంగనాథుడు



సింహవాహనంపై స్వామివారిని గ్రామపురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి స్వామివారి ఉత్సవ విగ్రహానికి పన్నీటి స్నానం చేయించి పట్టువస్త్రాలతో అలంకరించారు. మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సింహవాహనంతో అలంకరించిన గ్రామోత్సవ వాహనంపై కొలువుదీర్చారు. జయజయ ధ్వానాల మధ్య గోవింద నామాన్ని స్మరిస్తూ భక్తులు వాహనాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు, కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మైనార్టీల హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తాం



నిరసన ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: ముస్లిం, మైనార్టీ హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తామని, వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు అన్నారు. సోమవారం ఆత్మకూరులో సీపీఐ ఆధ్వర్యంలో తాలూకా కార్యదర్శి ప్రతాప్ అధ్యక్షతన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీని అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించి అక్కడ ధర్నా చేపట్టారు. జిల్లా నాయకులు రమేష్‌బాబు, సీనియర్ నాయకుడు ఇస్మాయిల్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటులో వక్ఫ్‌బిల్లుకు రాష్ట్రంలోని కూటమి భాగస్వామ్య పక్షాలు మద్దతివ్వడం సిగ్గుచేటన్నారు. చట్టాన్ని వెనక్కి తీసుకునేంతవరకు ఎలాంటి త్యాగానికైనా వెనుకాడబోమని, న్యాయం కోరుకునే అన్ని శక్తులతో పోరాటం చేస్తామన్నారు. సీపీఐ కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకటశివుడు, మహిళా సంఘం నాయకురాళ్లు ముర్తుజాబీ, జ్యోతి, ఏఐటీయూసీ నాయకులు చాంద్‌బాషా, లల్లు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.